
మినీకథ

# వినండి దేముడి గోల



**గాం**ధీనగర్ పార్కులో కూర్చున్నాం నేను, రామ్మూర్తి. "ఎంత చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదు. అమ్మా, నాన్నా ఎంతో కష్టపడి చదివిస్తారు. కాని వాళ్ళ ముసలితనంలో నిరుద్యోగులుగా వాళ్ళ ముందు మిగిలిపోతున్నాం" అంటూ వాపోయాడు రామ్మూర్తి.

నేను అప్పటికి రెండు సంవత్సరాల నుండీ ఏదో ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను.

ఏది ఏమైనా స్వంతంగా వ్యాపారం పెట్టుకుని జీవించడంలో వున్న సుఖం సుగోటి లేదురా అన్నాను

ఆ రోజు విడిపోయాము.

కొద్ది నెలల్లో నన్ను మైసూరులో వున్న మా బ్రాంచికి ప్రమోషన్ మీద వేశారు. వెళ్ళిపోయాను. రామ్మూర్తి ఏమయ్యాడో తెలియదు.

కొన్ని సంవత్సరాలకు నేను కంపెనీలో మంచి ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఎదిగిపోయాను.

ఆంధ్రాకు బ్రాంచీల ఇన్‌స్పెక్షన్‌కు నన్ను పంపించారు. కావాలని ముందు కాకినాడ బ్రాంచికి బయలుదేరాను. సామర్లకోట స్టేషన్‌లో నన్ను రిసీవ్ చేసుకుని కారులో కాకినాడ తీసుకువెళ్తున్నారు నన్ను

దారిలో

హైవే రోడ్డు ప్రక్కగా షామియానా వేసి పెద్దగా ఉత్సవాలు చేస్తున్నారు. అక్కడ పెద్ద దేవాలయం వున్నట్లుగా నేను ఎప్పుడూ చూడలేదు.

"ఏమిటి" అని అడిగాను డ్రైవర్ని

"బోసెమ్మ తల్లి ఉత్సవాలండి" అన్నాడు.

కారు స్లో చెయ్యమన్నాను. చేతిలో స్టీలు పళ్ళెంలో, అందరికీ బొట్లు పెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడొక వ్యక్తి. కార్లకు, జీపులకు, టూ వీలర్స్‌కీ, లారీలకు బొట్లు పెడుతున్నాడు. అందరూ నోట్లే ఇస్తున్నారు.

అతడ్ని పరిశీలనగా చూశాను.

అతను

కారు ఆపమని దిగేను

అతని దగ్గరగా వెళ్లి "నువ్వూ—"

"అవును రామ్మూర్తినే"

"అవును" అని నేను అంటూంటే తన చేతిలో పళ్లెం ప్రక్కనే వున్న ఒక పిల్లవాడి చేతిలో పెట్టి, రోడ్డు ప్రక్కనే వున్న గుడిసెలోకి తీసుకువెళ్లాడు.

"నువ్వు వెళ్లిపోయాక చాలా ఆలోచించాను. స్వంతంగా ఏదో ఒక వ్యాపారం చేయాలని. అన్ని వ్యాపారాల్లోకి ప్రస్తుతం చదువు, దేముడు, ముష్టి ఇలాంటివి కొన్ని చాలా తేలికగా కనిపించాయి. అందుకని బాగా ఆలోచించి ఈ 'చెట్టు కింద ఒక రోజు' పెద్ద రాయి పెట్టాను. మొదట కొన్ని రోజులు తరువాత పసువు కుంకుమ రాశాను

ఆ తరువాత పందిరి వేశాను.

కొన్ని రోజులకు 'బోసెమ్మ తల్లి' అని బోర్డు పెట్టాను.

అలా

అలా

కార్లు, లారీలు, అన్నీ ఇక్కడ ఆగడం ముందు చిల్లర డబ్బులతో మొదలై ఇప్పుడు కొబ్బరి కాయలు, నోట్లు వరకూ వచ్చింది.

వ్యాపారం చాలా లాభసాటిగా వుంది. కాకినాడలో మంచి ఇల్లు కట్టాను. కాని ఈ పాకలో వుంటున్నట్టుగా రాత్రివరకు వుంటాను. తరువాత జీతగాడు వుంటాడు.

రామ్మూర్తి ఏదో చెప్తున్నాడు. నేను వింటున్నానా లేదా అన్నది అప్రస్తుతం. అయితే

సమాజంలో జరిగే అవినీతి కార్యక్రమాలు వచ్చి మోసం చేస్తూ ప్రజలను మోసపూరితం చేస్తున్న వ్యాపారులు, కల్లబొల్లి కబుర్లు చెప్పి, ప్రజల్ని కలల్లో విహరింపజేస్తున్న రాజకీయ నాయకులు, వాళ్ళందరి కన్నా నాకు రామ్మూర్తి చేసేది పెద్ద మోసం కాదనిపించింది.

పైగా

ఒక మహత్తరమైన అలవాటు ప్రజల్లో చేస్తున్నాడు. దేముడి మీద భక్తి ఏర్పడేట్లు చేస్తున్నాడు. ఏ బండి అయినా సరే కాకినాడ వెళ్లేది, సామర్లకోట వేపు వెళ్లేది 'బోసెమ్మ తల్లి' దగ్గర ఆగాల్సిందే. ఏడాదికోసారి ఉత్సవాలు.

బాగానే వుంది.

"మరి వస్తాను. నేను కర్నాటకలో వుంటా. నిన్ను కాకినాడలో కలుస్తాను లే" అంటూ కారు ఎక్కాను. మా కారుకు బొట్లు పెట్టారు. డ్రైవరు భక్తిగా దణ్ణం పెట్టుకుని పది రూపాయిలు వేశాడు. పళ్లెంలో నేనూ బొట్టు పెట్టుకుని దేవతకు దణ్ణం పెట్టుకుని మా రామ్మూర్తిని ఇలాగే చల్లగా చూడు" అని వంద రూపాయిల నోటు వేశాను.

షామియానాలో మైకులో

"దేముడు చేసిన మనుషుల్లారా
వినండి దేముని గోల
మనుషులు చేసిన దేముళ్ళారా—
వినండి మనుషుల గోలా"

పాట వినిపిస్తోంది.

నా కారు కదిలింది.

—కె.బి.కృష్ణ



**మానసచోరుడు**

వయస్సు : 22 సంవత్సరాలు
ఎత్తు : 5.6 అంగుళాలు
పేరు : అక్షయ్‌ఖన్నా
నివాసం : అమ్మాయిలగుండెల్లో

వినోద్‌ఖన్నా కొడుకు అక్షయ్‌ఖన్నా ఇప్పుడు లేటెస్ట్ హార్ట్ థ్రాబ్. ఇతగాడి ప్రేమ జీవితంపై ఇంతవరకూ ఎలాంటి పుకార్లు రాలేదు. ఇంతకూ ఈ ఇతని మనసును దోచిన రాకుమారి ఎవరూ అని ఆరాతీస్తే ఆమె ఎవరో వుంది, లేకపోనూవచ్చు అని చిరునవ్వు నవ్వాడు.